జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్ల పాత బకాయిలు చెల్లించండి



పనులు చేయిస్తున్న కార్పొరేటర్ శశికళకృష్ణ

అబిడ్స్: జీహెచ్‌ఎంసీలో కాంట్రాక్టర్లకు పాత బకాయిలు చెల్లించాలని మంగళ్‌హాట్ కార్పొరేటర్ శశికళ కృష్ణ డిమాండ్ చేశారు. గత సంవత్సరం పైగా వేలాది మంది కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించకపోవడంతో అన్ని ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు, ఇతర జీహెచ్‌ఎంసీ పనులు ఏ మాత్రం కాదలడం లేదన్నారు. మంగళ్‌హాట్ గుఫానగర్‌లో దెబ్బతిన్న రోడ్డుకు ఓ ప్రైవేటు కాంట్రాక్టర్ సహాయంతో స్వయంగా ప్యాచ్‌వర్క్ వేయించారు. అనంతరం శశికళ కృష్ణ మాట్లాడుతూ..బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీహెచ్‌ఎంసీ పరిధిలోని కాంట్రాక్టర్లకు రూ.950 కోట్ల పాత బకాయిలు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ పాత బకాయిలు చెల్లించకపోవడంతో మొత్తం రూ.1350 కోట్లకు చేరిందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా జీహెచ్‌ఎంసీకి ఇంత వరకూ నిధులు విడుదల చేయలేదన్నారు. దీంతో స్థానిక కార్పొరేటర్లు పనులు చేయించలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలం ప్రారంభం కానుండడంతో రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ, నాలా మరమ్మతులు వేగంగా చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మెహిదీపట్నం ఆర్టీసీ డిపోలో గ్రాండ్ హెల్త్ చాలెంజ్ 2.0



గ్రాండ్ హెల్త్ చాలెంజ్ కార్యక్రమంలో డిపో మెనేజర్ బీవీ కృష్ణమూర్తి తదితరులు

గోల్కొండ: ఆర్టీసీ సిబ్బంది పూర్తి ఫిట్‌నెస్‌తో ఆరోగ్య సమస్యలు ఏమి లేకుండా ఉండాలన్నదే తమ సంస్థ వీసీ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ఆశయమని ఆర్టీసీ మెహిదీపట్నం డిపో మేనేజర్ బీవీ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం ఆర్టీసీ డిపోలో గ్రాండ్ హెల్త్ చాలెంజ్ 2.0ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థకు చెందిన ప్రతి ఉద్యోగి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే సంస్థ ఆశయమని ఆయన అన్నారు. ఇందులో భాగంగా ఆర్టీసీ వారు గ్రాండ్ హెల్త్ చాలెంజ్ 2.0ను ప్రారంభించారన్నారు. ఇందులో భాగంగా సంస్థకు చెందిన ప్రతి ఉద్యోగికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు సైతం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. డాక్టర్లు ఇచ్చిన రిపోర్ట్స్ ప్రకారం ప్రత్యేక వైద్య నిపుణులచే వైద్య పరీక్షలు చేసి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆర్టీసీ లాభాల బాటలో పయనించడమేకాకుండా సిబ్బంది కారణంగా బస్సు ప్రమాదాలు నివారించాలన్నదే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ ఎస్.నమృత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వం రావడం ఖాయం



గిడుగు రుద్రరాజును సన్మానిస్తున్న కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: కేంద్రంలో ఈసారి ఇండియా కూటమి ప్రభుత్వం రావడం ఖాయమని ఉమ్మడి తెలుగు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు అన్నారు. మంగళవారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు శాలువా వేసి సన్మానించారు. ఈ సందర్భంగా గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ.. పదేళ్ల శ్రీరాముడి పేరుతో దేశాన్ని పాలించి దేశ ఆర్థిక వ్యవస్థను బీజేపీ భ్రష్టుపట్టించిందన్నారు. అంతేకాకుండా కులాల చిచ్చుపెడుతూ విభజించి పాలించు అనే బ్రిటిష్ సూక్తిని పాటించారని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు మళ్లీ ఆదరిస్తున్నారని కర్ణాటక, తెలంగాణలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం దీనికి నిదర్శనమన్నారు. ఆయనను కలిసిన వారిలో ఎం.రఘుపాల్‌రెడ్డి, వెంకన్న, బాబు, వెంకటకృష్ణ తదితరులున్నారు.

వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా చర్యలు



బస్తీలో సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా బస్తీల్లో పర్యటిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. మంగళవారం ఆయన నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి బస్తీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో ప్రజలకు వరద నీటి సమస్యలు తలెత్తకుండా అన్ని విభాగాల అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గంగానగర్ నాలా, యాకుత్‌పురా నాలా, యశ్రఫ్‌నగర్ నాలా, తలాబ్‌కట్టా నాలా, నాగాబౌలీ యాకుత్‌పురా రైల్వే స్టేషన్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేసి వరద నీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు రెయిన్ బజార్, పత్తర్‌గట్టీ డివిజన్ల కార్పొరేటర్లు మహ్మద్ వసీవుద్దీన్, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



గ్యారిసన్ సెంటర్‌లో సైనికులకు ట్రాఫిక్ అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గోల్కొండ: వాహనదారులు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. మంగళవారం మెహిదీపట్నం గ్యారిసన్ సెంటర్‌లో సైనికులకు ట్రాఫిక్ నిబంధనలు, వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 13వ డోగ్రా రెజిమెంట్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ జి.శంకర్ మాట్లాడుతూ.. వాహనచోదకులు వాహనాలు నడిపే సమయంలో తమ వెంట వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. అంతేకాకుండా హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని, మైనర్లు వాహనం నడిపితే ప్రమాదం ఉంటుందని అన్నారు. దేశ రక్షణ కోసం సదా విధులు నిర్వహించే సైనికులు రోడ్లపై వాహనాలు నడిపే సమయంలో అన్ని జాగ్రత్తలు పాటించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పలువురు డోగ్రా రెజిమెంట్ సైనికులు ట్రాఫిక్ నిబంధనలపై తమకు ఉన్న అనుమానాలను ఏసీపీని అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డోగ్రా రెజిమెంట్ లెఫ్టినెంట్ కర్నల్ అనిమేష్‌రావత్, మేజర్ అజయ్, లెఫ్టినెంట్ గణేష్‌చౌదరితో పాటు ఆసిఫ్ నగర్ ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

ఉస్మానియా ఆసుపత్రికి నూతన భవనం అవసరం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

అఫ్జల్‌గంజ్: పేదలకు మరింత మెరుగైన వైద్య చికిత్సల కోసం ఉస్మానియా ఆసుపత్రికి నూతన భవన అవసరం ఉందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. అయితే పాత భవనం కూల్చి కొత్త భవనం నిర్మిస్తారా.. లేదా చంచల్‌గూడ జైలు, ప్రింటింగ్ ప్రెస్ లేదా గోషామహల్ స్టేడియంలో నిర్మిస్తారా..అనే విషయాన్ని ప్రభుత్వానికి వదిలేయాలని సూచించారు. మంగళవారం ఉస్మానియా ఆసుపత్రిలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఉస్మానియా అలుమి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎంపీ అజీజ్ పాషా, సియాసత్ దినపత్రిక సంపాదకులు అమీర్ అలీఖాన్ హాజరయ్యారు. ఉస్మానియా అలుమ్మి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ మహేష్‌కుమార్, హెరిటేజ్ కమిటీ సభ్యులు అనురాధారెడ్డి, జావేద్ ఇక్బాల్‌తో పాటు తెలంగాణ వైద్యుల సంఘం ప్రతినిధులు, ఉస్మానియా ఆసుపత్రిలోని వివిధ విభాగాల అధిపతులు, వైద్యులు, జూనియర్ డాక్టర్లు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో ఉస్మానియా ఆసుపత్రి ఆసియా ఖండంలోనే 7వ స్థానంలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్, తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్ బొంగు రమేష్, డాక్టర్ పల్లం ప్రవీణ్, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ రమేష్ కుమార్, డాక్టర్ అజ్మీర రంగ, తపాడియా, జి.రమేష్, డాక్టర్ రాకేష్ సహాయ్, డాక్టర్, డాక్టర్ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అద్దె భవనంలోనే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయమూ అక్కడే కొనసాగింపు

క్రయ, విక్రయదారులకు తప్పని ఇబ్బందులు



అద్దె భవనంలో కొనసాగుతున్న జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

నాంపల్లి: క్రయ, విక్రయదారులతో ఎప్పుడూ రద్దీగా ఉండే హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఇక్కడే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయం రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రికి ఎదుట ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ భవనాల కొరత ఎక్కువగా ఉండేది. ఉమ్మడి ఏపీ రెండు రాష్ట్రాలుగా విడిపోవడం, ఏపీకి చెందిన కార్యాలయాలన్నీ అమరావతికి వెళ్లిపోవడంతో నగరంలో చాలా ప్రభుత్వ భవనాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగించుకోవడంలో ప్రభుత్వ అధికారులు దృష్టిసారించడం లేదు. ఇప్పటికే ఖాళీగా ఉండే ప్రభుత్వ భవనాల్లోకి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్చాలంటూ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా మారేందుకు అధికారులు అయిష్టంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

క్రయ, విక్రయదారులు చెట్ల కిందే..

ఎన్నికల కోడ్ ముగియగానే సబ్ రిజిస్ట్రార్, రిజిస్ట్రార్ కార్యాలయాలకు కొత్తగా సొంత భవనాలు కేటాయించే పనిలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. రెడ్‌హిల్స్‌లో ఉండే రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారు కూర్చునే వెసులుబాటు లేకుండా పోయింది. ఒంటికి, రెంటికి ఇంటికే పోవాల్సిన దుస్థితి నెలకొంది. సుదూర ప్రాంతాల వారైతే సులబ్ కాంప్లెక్స్‌లను ఆశ్రయిస్తున్నారు. రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయానికి వచ్చేవారు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రయవిక్రయదారులు చెట్ల కింద, ఇరానీ హోటల్స్‌లో సేదతీరుతున్నారు.

సిబ్బంది కొరత పట్టి పీడిస్తోంది..

ఆదాయం ఎక్కువగా తెచ్చిపెట్టే కార్యాలయంగా రెడ్‌హిల్స్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంగా పేరుంది. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చే క్రయవిక్రయదారులకు వెయిటింగ్ హాల్, తాగునీటి సదుపాయం, కెఫేటేరియా, పార్కింగ్ లాంటి అన్ని సదుపాలు ఉండాలి. కానీ అలాంటివేమి ఇక్కడ కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ కార్యాలయంలో సిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. ఏదైనా చిన్న పని పూర్తి చేసుకోవాలన్నా గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఎవరైనా సిబ్బంది సెలవులో వెళ్తే సదరు అధికారి లేదా ఉద్యోగి విధుల్లోకి మళ్ళీ వచ్చే వరకు పని కావడం లేదు. దీనికి తోడు ఇక్కడ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పెత్తనం, దళారుల ఆగడాలు మితిమీరిపోయాయి. ఇక్కడి లావాదేవీలన్నీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకే రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు అప్పగించడంతో బయటి దళారులు యథేచ్ఛగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనికి ప్రవేశిస్తూ దందాలు కొనసాగిస్తున్నారు.


మేరు సంఘం ఎన్నికలకు నామినేషన్లు షురూ..

చార్మినార్: జూన్ 30న జరుగనున్న తెలంగాణ రాష్ట్ర మేరు సంఘం ఎన్నికలను పురస్కరించుకుని ఈ నెల 30వ తేదీ వరకు నామినేషన్లను తీసుకోనున్నామని సంబంధిత ఎన్నికల అధికారులు తెలిపారు. మంగళవారం నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ మూడు రోజుల వరకు కొనసాగుతుందన్నారు. జూన్ 13 నుంచి 16 వరకు నామినేషన్ల పరిశీలన, 17న ఉపసంహరణ, 18న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించనున్నామన్నారు. జూన్ 30న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని.. అదే రోజు సాయంత్రం 6 గంటలకు ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాల వెల్లడి జరుగుతుందన్నారు.

షార్ట్‌ఫిల్మ్ కాంటెస్ట్ ఎంట్రీలకు ఆహ్వానం

నాంపల్లి: ఆర్థిక అక్షరాస్యతపై షార్ట్‌ఫిల్మ్ కాంటెస్ట్ కోసం ఎంట్రీలు ఆహ్వానిస్తున్నట్లు ఫార్చ్యూన్ అకాడమీ సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ మణి పవిత్ర తెలిపారు. రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో షార్ట్‌ఫిల్మ్ ఎంట్రీల వివరాలను వెల్లడించారు. ఫార్చ్యూన్ అకాడమీ ఆర్థికంగా విజయవంతమైన వ్యక్తుల సైన్యాన్ని సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకే అకాడమీ ఈ షార్ట్‌ఫిల్మ్ కాంటెస్ట్‌ను నిర్వహిస్తుందన్నారు. చలన చిత్రం ఇంగ్లిషు లేదా తెలుగులో ఉండాలని సూచించారు. క్షితిజ సమాంతర లేదా నిలువు ఆకృతిలో రెండు నిమిషాల కంటే తక్కువ వ్యవధిలో షార్ట్ ఫిల్మ్ ఉండాలన్నారు. డబ్బు ప్రాముఖ్యత, కొనుగోలు శక్తి, పెట్టుబడి, పొదుపు సంస్కృతి, మధ్యతరగతి సమస్యలు, ఎమోషనల్ కనెక్షన్, ర్యాగ్స్ టు రిచ్, పిగ్గీ బ్యాంక్, ప్లాస్టిక్ డబ్బు, డిజిటల్ లావాదేవీలు వంటి అంశాలపై షార్ట్ ఫిల్మ్ రూపొందించాలన్నారు. ఎంట్రీలను జులై 31 లోగా పంపాల్సి ఉంటుందని, ఎంట్రీలను fortuneacademyhub@gmail.com మెయిల్‌కు పంపాలని కోరారు. ఎంపికైన ఎంట్రీలకు నగదు బహుమతితో పాటుగా ప్రశంసా పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదటి, రెండు, మూడో బహుమతులకు రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు, మరో ఐదు ఎంట్రీలకు ప్రోత్సాహక బహుమతులు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు.

వీర్ సావర్కర్‌కు ఘన నివాళి



పూలమాలలు వేస్తున్న గోవింద్‌రాఠి

అబిడ్స్/సుల్తాన్‌బజార్: వీర్ సావర్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాచిగూడ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం వీర్ సావర్కర్ చేసిన సేవలను గోవింద్‌రాఠి కొనియాడారు. ఈ కార్యక్రమంలో సుమిత్‌రాఠి, మనోజ్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



రాజేందర్‌యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయ చైర్మన్‌గా రెండోసారి ఎన్నికైన సి.రాజేందర్‌యాదవ్, కోశాధికారి పోసాని సతీష్ ముదిరాజ్‌ను స్థానిక నాయకులు మంగళవారం సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. సన్మానించిన వారిలో శైలేందర్ యాదవ్, రాజు యాదవ్, ముఖేష్, అశ్విన్, టోని యాదవ్ తదితరులున్నారు.

ఘనంగా వరల్డ్ హైపర్ టెన్షన్ డే



ర్యాలీలో పాల్గొన్న ప్రిమియర్ ఆసుపత్రి వైద్యులు

గోల్కొండ: వరల్డ్ హైపర్ టెన్షన్ డే మెహిదీపట్నం నానల్‌నగర్‌లోని ప్రీమియర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. నానల్‌నగర్‌లోని ఆసుపత్రి నుంచి లక్ష్మీనగర్ చౌరస్తా వరకు జరిగిన ఈ ర్యాలీని ఆసుపత్రికి చెందిన సిద్ధార్థ మరడా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ ఆశయమన్నారు. ఆరోగ్యకరమైన రేపటి కోసం క్రమం తప్పకుండా ప్రతి ఒక్కరూ రక్తపోటు పరీక్షలు చేసుకుంటూ ఉండాలని సూచించారు. గ్లెన్ మార్క్ ఫార్మా ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో ఆసుపత్రి జనరల్ మేనేజర్ శ్రీనివాస్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ అడ్మిషన్లలో అవకతవకలను సరిచేయాలి



ప్రొఫెసర్ లింబాద్రికి వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

విజయనగర్‌కాలనీ: ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్ అడ్మిషన్లలో అవకతవకలతో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ల నియామకంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మంగళవారం బీజేవైఎం ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ సెవెళ్ల, కోశాధికారి యోగరాజ్ సింగ్, ఉపాధ్యక్షులు మహేష్ నామాని, సంతోష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించండి సారూ..



జీతాలు ఇప్పించాలంటూ ఎమ్మెల్యే కౌసర్‌ను కోరుతున్న శానిటేషన్ కార్మికులు

గోల్కొండ: జీతాలు ఇప్పించాలంటూ కార్వాన్ నియోకవర్గానికి చెందిన శానిటేషన్ కార్మికులు ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం వారు ఎమ్మెల్యేను టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిశారు. అసలే అరకొర జీతాలతో నెట్టుకొస్తున్న తమకు అధికారులు మూడు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని వారు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. కార్వాన్ ఏఎంహెచ్ఓ డాక్టర్ అనురాధను జీతం అడిగితే బల్దియా డిప్యూటీ కమిషనర్‌ను కలవాలని బుకాయిస్తున్నారని వారు పేర్కొన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ మీకు జీతాలు వచ్చేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని అన్నారు. ఏఎంహెచ్ఓతోనే కాకుండా ఇతర అధికారులతో సైతం మాట్లాడి మీకు వెంటనే జీతాలు అందేలా తనవంతు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చార్మినార్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టీజీఎస్‌పీడీసీఎల్ చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఏజీ కాలనీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని సంజీవని హిల్స్, నలంద నగర్, సిరిమల్లే నగర్, ఏజీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే హైదర్‌గూడ విద్యుత్ ఫీడర్ పరిధిలోని నలందనగర్, వెంకటేశ్వర ఎన్‌క్లేవ్, డాక్టర్ కాలనీ, సిరిమల్లేనగర్, లోటస్ స్కూల్, ప్లీజెంట్ పార్క్, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, లక్ష్మీ నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు. అత్తాపూర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఈశ్వర్ థియేటర్, హైదర్‌గూడ విలేజ్, గాంధీ బొమ్మ, కాంతారెడ్డి నగర్, రాధాకృష్ణా నగర్, అంబియన్స్ ఫోర్ట్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. జనప్రియ ఏబీసీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని కేశవ నగర్, క్రిష్ణా నగర్, శివనగర్, మోర్ సూపర్ మార్కెట్, గుమ్మకొండ కాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సైఫాబాద్ డివిజన్ పరిధిలో..

అబిడ్స్: సైఫాబాద్ డివిజన్ పరిధిలో చెట్లకొమ్మలను తొలగించనున్న దృష్ట్యా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సైఫాబాద్ డివిజన్ సీబీడీ అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు 11 కేవీ గగన్ మహల్, గోషామహల్ ఫీడర్, తాళ్లబస్తీ ఫీడర్ల పరిధిలోని లోయర్ ట్యాంక్‌బండ్, కట్టమైసమ్మ టెంపుల్, బరఫ్‌బాగ్, గోశాల, అంబేడ్కర్ భవన్ రజక్ కాలనీ, సర్దార్‌జీ పంప్ హౌస్, కావడిగూడ, ఎమ్మార్వో ఆఫీస్ ప్రాంతం, ఏసీటీసీ కాలేజ్, వార్త ఆఫీస్, సాయిబాబా టెంపుల్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 12:30 నుంచి 2 గంటల వరకు 11 కేవీ ముషీరాబాద్ ఫీడర్ పరిధిలోని ముషీరాబాద్ మెయిన్‌రోడ్డు బీర్‌బన్ గల్లీ, కేర్ ఆసుపత్రి, రాజా డీలక్స్ ఎదురుగా, బడీ మజీద్, గ్రేవియార్డ్ 1, 2, సత్తర్‌బాగ్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు 11 కేవీ బోలక్‌పూర్ ఫీడర్ పరిధిలోని దేవునితోట, ఎస్సీ, ఎస్టీ హాస్టల్ ప్రాంతం, కవాడిగూడ బీఎస్ఎన్ఎల్ ఆఫీస్, బోలక్‌పూర్ హౌస్, రిలయన్స్ టవర్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని సీబీడీ అధికారులు వెల్లడించారు.

బదిలీల తర్వాతే పదోన్నతులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న వివిధ మెడికల్ కాలేజీల వైద్యులు

సుల్తాన్‌బజార్: వైద్యుల సాధారణ బదిలీల ప్రక్రియ నిర్వహించిన తర్వాతే పదోన్నతులు చేపట్టాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ టీజింగ్ ఆసుపత్రి డాక్టర్స్ జేఏసీ డిమాండ్ చేసింది. మంగళవారం కోఠి మెడికల్ కాలేజీ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో వివిధ జిల్లాల మెడికల్ కాలేజీల వైద్యులు పాల్గొని నూతనంగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ టీచింగ్ హాస్పిటల్స్ డాక్టర్స్ జేఏసీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వైద్యుల సాధారణ బదిలీల ప్రక్రియలో వైద్య సంఘాల ఒత్తిళ్లకు తావు లేకుండా పారదర్శకంగా జరిగేలా చేపట్టాలని రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల మెడికల్ కాలేజీల వైద్యుల బృందంతో కూడిన జేఏసీ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ టీచింగ్ హాస్పిటల్స్ డాక్టర్స్ జేఏసీ చైర్మన్ డాక్టర్ వి.శేఖర్, కన్వీనర్లు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ సాంబశివారెడ్డి, డాక్టర్ జగతి, డాక్టర్ హేమలత, డాక్టర్ అమరావతి, కో కన్వీనర్లు డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ బెంజ్‌మెన్, డాక్టర్ మనీష్ గుప్తా, డాక్టర్ అరుణ, డాక్టర్ నీలవేణి తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు డాక్టర్ మాధవ్, డాక్టర్ జితేంద్ర, డాక్టర్ అమరావతి, డాక్టర్ రమాదేవి, డాక్టర్ కవిత, డాక్టర్ నాగవేణి, డాక్టర్ మూసాఖాన్, డాక్టర్ గణేష్, గౌరి, డాక్టర్ శకుంతల, డాక్టర్ రవి మోహన్, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ శ్రీవాణి పాల్గొన్నారు.

'సోనియా గాంధీని ఆహ్వానించడం శుభ పరిణామం'



వెంకటేశ్

గౌలిపురా: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానించడం శుభపరిణామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ అన్నారు. అనేక దశాబ్దాలుగా తెలంగాణ రాష్ట్ర ప్రజల ఉద్యమ త్యాగాలను గుర్తించిన నాటి యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ కృషి, పట్టుదలతోనే పార్లమెంటులో ప్రత్యేక తెలంగాణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపజేశారని తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు సోనియాగాంధీని ఆహ్వానించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఢిల్లీకి వెళ్లి ఆమెను ఒప్పించడం సంతోషకరమన్నారు.

పోగొట్టుకున్న బ్యాగ్ అందజేత



చాంద్రాయణగుట్ట: విలువైన వస్తువులతో కూడిన బ్యాగ్‌ను పోగొట్టుకున్న మహిళకు చాంద్రాయణగుట్ట పోలీసులు సేఫ్‌గా అందజేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అఫ్రీన్ బేగం అనే మహిళ రూ.22 వేల నగదు, ఏటీఎం కార్డులను బైక్‌పై వెళుతూ పడేసుకుంది. వెంటనే చాంద్రాయణగుట్ట పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తుండగా, అప్పటికే బ్యాగ్‌ను చూసిన ఆటోడ్రైవర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొస్తున్నాడు. దీంతో బ్యాగ్‌ను సురక్షితంగా బాధిత మహిళకు అందజేశారు. దీంతో ఆమె పోలీసులకు ధన్యవాదాలు తెలిపింది.

గృహిణి అదృశ్యం



నసీం భాను

సంతోష్‌నగర్: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ గృహిణి కనిపించకుండా పోయిన ఘటన ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మాదన్నపేట్ భానునగర్‌కు చెందిన నసీం భాను (40), మహ్మద్ జమీల్ దంపతులు. కాగా జమీల్ ఉద్యోగం నిమిత్తం రాజస్థాన్‌లో ఉండటంతో నసీం భాను మాత్రమే ఒంటరిగా ఉంటుంది. కాగా ఈ నెల 22న నసీం భానుకు తల్లి షరీఫా భాను ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో నసీం భాను ఇంటికి వెళ్లి చూడగా ఇంట్లో ఎవరూ కనిపించలేదు. దీంతో నసీం కోసం స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన కూతురు కనిపించడం లేదని తల్లి షరీఫా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

బుల్లెట్ బండి పేలిన ఘటనలో మరో వ్యక్తి మృతి



అబ్దుల్ రహీం ఖాన్ (ఫైల్)

గౌలిపురా: బుల్లెట్ పెట్రోల్ ట్యాంక్ పేలిన ఘటనలో చికిత్స పొందుతున్న నాలుగో వ్యక్తి మృతి చెందాడు. ఈ నెల 12వ తేదీన జరిగిన ఈ ప్రమాదకర ఘటనలో ఇప్పటికే ముగ్గురు మృత్యువాత పడగా మంగళవారం మరో వ్యక్తి మృతి చెందాడు. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి వివరాల ప్రకారం..సంతోష్‌నగర్ ధోబీఘాట్‌కు చెందిన అబ్దుల్ రహీం ఖాన్(30) బుల్లెట్ వాహనంపై తన భార్యతో కలిసి వెళ్తుండగా బుల్లెట్‌కు మంటలంటుకున్నాయి. అప్రమత్తమైన అబ్దుల్ రహీం ఖాన్ వాహనాన్ని ఆపి స్థానికంగా ఉన్న వారి సహాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తుండగా గాయాలకు గురై చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

ఎన్టీఆర్ శత జయంతి సంచిక ఆవిష్కరణ



నాంపల్లి: చెన్నపురి తెలుగు అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలు జరిగాయి. సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ హాజరయ్యారు. సంపాదకులు తూమాటి సంజీవరావు సంపాదకత్వంలో రూపుదిద్దుకున్న ఎన్టీఆర్ శత జయంతి సంచికను ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని బి.సుందరరావు సమీక్షించారు. తెలుగు వర్సిటీ విస్తరణల సేవా విభాగం ఇన్‌చార్జి రింగు రామ్మూర్తి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. సాహితీ మూర్తి సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.